సాక్షి
తిరుపతి
బుధవారం । 17 । జులై । 2024



ఇంకా ఆస్పత్రిలోనే..

నాయుడుపేట గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులు 71 మంది ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నారు. - 8లో



విజిలెన్స్‌తో సమన్వయం..

టీటీడీ విజిలెన్స్ అధికారులతో పోలీసులు సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. - 8లో



మెగా ఉద్యోగ మేళాకు స్పందన

శ్రీసిటీలో జరిగిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 150 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

పరిశ్రమల స్థాపనకు తిరుపతి బెస్ట్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పరిశ్రమల స్థాపనకు తిరుపతి జిల్లా అనుకూలమని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నచిన్న పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వారికి జాప్యం లేకుండా సింగిల్‌విండో పద్ధతిలో అనుమతులు ఇవ్వాలని సూచించారు. కొత్తగా నెలకొన్న పరిశ్రమల స్థాపనలో పురోగతి చూపాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఐఐసీ జెడ్‌ఎం చంద్రశేఖర్, డిప్యూటీ జెడ్‌ఎంలు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

రేణిగుంట ఎయిర్‌పోర్టులో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. విమానాశ్రయానికి సంబంధించిన హార్టికల్చర్, లైటింగ్ సంబంధిత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. తుడా వీసీ వెంకటేశ్వర్లుకు, ఆర్‌అండ్‌బీ డీఈ నాగమల్లయ్యకు విమానాశ్రయ బ్యూటిఫికేషన్, తగినంత లైటింగ్ ఏర్పాటుపై పలు సూచనలు చేశారు.

నేడు జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీలో ఎడ్యుకేషన్ పాలసీ -2020 అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సదస్సును వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం, ఢిల్లీకి చెందిన ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, ఎస్వీయూ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ సదస్సుకు జాతీయ స్థాయి ప్రొఫెసర్లు, వర్సిటీల అధికారులు పాల్గొననున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,054 మంది స్వామివారిని దర్శించుకోగా 26,239 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.72 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

19న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి టి.శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. సుమారు 8 ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, డిగ్రీ అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు వర్సిటీలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. వివరాలకు 95338 89902, 79898 10194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తిరుమలలో తమిళనాడు అధికారికి చేదు అనుభవం

తిరుమల: తిరుమలలో తమిళనాడు దేవదాయశాఖ ప్రత్యేక కార్యదర్శికి చేదు అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళితే... శ్రీవారి ఆలయంలో మంగళవారం నిర్వహిస్తున్న ఆణివార ఆస్థానం కార్యక్రమం కోసం తమిళనాడులోని శ్రీరంగం శ్రీరంగనాథస్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలను తీసుకువచ్చి శ్రీవారికి అందించేందుకు తమిళనాడు దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు, ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్ దంపతులు పెద్దజీయర్ మఠానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వారు పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి కలసి శ్రీవారి ఆలయంలోకి పట్టువస్త్రాలను తీసుకువచ్చేందుకు దాదాపు పదిమందికి టీటీడీ పాసులను జారీచేసింది. అయితే తమిళనాడు దేవదాయశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రవేశించే లోపు మంత్రితో వచ్చిన మరో ఇద్దరు ఆలయంలోకి వెళ్లిపోయారు. దీంతో దేవదాయశాఖ ప్రత్యేక కార్యదర్శి దంపతులను మహాద్వారం గేటు వద్ద టీటీడీ విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఆలయం లోపలకు వెళుతున్న తమిళనాడు దేవదాయశాఖ మంత్రి వెనుకకు వచ్చి తమ ప్రత్యేక కార్యదర్శి దంపతులను అనుమతించాలని కోరారు. ఈ నేపథ్యంలో అక్కడ దాదాపు పదినిమిషాల పాటు గందరగోళం నెలకొంది. అనంతరం టీటీడీ విజిలెన్స్ అధికారులు దేవదాయశాఖ ప్రత్యేక కార్యదర్శిని మహాద్వారం నుంచి ఆయన సతీమణిని బయోమెట్రిక్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి అనుమతించడంతో సమస్య పరిష్కారమైంది.



తిరుమలలో భక్తులకు మోక్ష కటాక్ష ప్రాప్తి దర్శనం ఇస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

ఆధ్యాత్మిక శోభితం!

కట్ ఫ్లవర్స్.. దేశీయ పుష్పాల సుగంధభరిత పరిమళాలతో తిరుమల పులకించింది. మంగళవారం ఆణివార ఆస్థానం సందర్భంగా శ్రీవేంకటేశ్వరుడు సతీసమేతంగా పుష్పపల్లకీలో ఊరేగుతూ కనువిందు చేశారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారిని తనివితీరా దర్శించి భక్తులు పులకించిపోయారు. గోవింద నామస్మరణ చేస్తూ కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– తిరుమల



మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

వసతి వెతలు

పేద, మధ్యతరగతి, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు గురుకుల, సంక్షేమ వసతిగృహాలు ఏర్పాటు చేశారు. వాటిలో అరకొర వసతులు, పారిశుద్ధ్య సమస్యలు, నాణ్యత లోపించిన ఆహారంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. శుభ్రమైన మరుగుదొడ్లు, శుద్ధమైన తాగునీరు, మెనూ ప్రకారం భోజనం అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు అటువైపు కన్నెత్తి చూడకపోగా.. అధికారులు సైతం తమకేమీ పట్టనట్టు గాలికొదిలేశారు. ఫలితంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గురుకుల, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు.

సాక్షి ఫోకస్



చిత్తూరు గురుకుల పాఠశాల డార్మెటరీలో ఇదీ పరిస్థితి

సమస్యల్లో గురుకుల, సంక్షేమ వసతి గృహాలు

- పేద విద్యార్థులకు అందని నాణ్యమైన సౌకర్యాలు
- నాసిరకం ఆహారంతోనే అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో సమస్యలు చక్కబడడంలేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రపరిచేందుకు సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు అలాగే వినియోగించుకుంటున్నారు. చాలా వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలో విఫలమవుతున్నారు. ప్రభుత్వం మారడంతో బదిలీల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ పర్యవేక్షణను గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అత్యుత్సాహం

చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని గురుకుల పాఠశాలలకు గత ప్రభుత్వం నాడు–నేడు పథకంలో ఆర్వో ప్లాంట్లను సరఫరా చేసింది. అయితే కుప్పం, పెద్దపంజాణి, సదుం, గుడుపల్లి, గంగాధరనెల్లూరు, తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు, నాయుడుపేట, శ్రీకాళహస్తిలోని గురుకుల పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను వినియోగించకుండా మరుగునపడేశారు. విద్యుత్ బిల్లులను తగ్గించామని చెప్పుకునేందుకు ఆర్వో ప్లాంట్లను వినియోగించకుండా ప్రిన్సిపాళ్లు వదిలేసినట్టు సమాచారం. వసతి గృహాల్లో అపరిశుభ్రంగా ఉన్న ట్యాంక్ నీరే తాగాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

కమీషన్ కోసం నాసిరకం కూరగాయలు

పలు వసతి గృహాల్లో వార్డెన్లు మీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. మార్కెట్లో కిలో టమాటాలు రూ.60, ఉల్లిపాయలు రూ.50 ఉంటే వసతి గృహాల వార్డెన్లు నాసిరకంగా విక్రయించే రూ.100కు 5 కిలోల టమాటాలు, ఉల్లిపాయలను కొనుగోలు చేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి, పలమనేరు, కుప్పం, నాయుడుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరులోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో వీటినే అధికంగా వినియోగిస్తున్నారు. కుళ్లిన కూరగాయలతో వంటలు చేయడంతో విద్యార్థులు పలు రకాల అనారోగ్యానికి గురవుతున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	05
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	17
ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు	20
ఏపీ బీసీ రెసిడెన్షియల్ గురుకులాలు	12

ఆరోగ్య సమస్యలతో గైర్హాజరవుతున్న విద్యార్థులు

వసతి గృహం	హాజరు	గైర్హాజరు
చిత్తూరు జిల్లాలో ఎస్సీ వసతి గృహాలు	1,916	1,200
తిరుపతి జిల్లాలో ఎస్సీ వసతిగృహాల్లో	2,691	2,300
ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో (చిత్తూరు)	516	100
ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో (తిరుపతి)	3,914	577
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ (చిత్తూరు)	2,768	729
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ (తిరుపతి)	4,302	2,070

పాచిన ఆహారమే దిక్కు

గురుకులాలు, వసతి గృహాల్లో పాచిన ఆహారాన్నే విద్యార్థులకు వండిస్తున్నారు. నిబంధనల ప్రకారం వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మెనూను కచ్చితంగా అమలుచేయాలి. అయితే మెనూ ఏ మాత్రం అమలు కావడం లేదు. విద్యార్థులు ఎక్కువ.. వంట మనుషులు తక్కువగా ఉండడంతో నిన్నటి ఆహారాన్ని వడ్డిస్తున్నారు. తిరుపతి జిల్లా పుత్తూరులోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 105 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ గతంలో ఇద్దరు వంట మనుషులుండగా..ప్రస్తుత కూట మి ప్రభుత్వం ఒకరిని తొలగించింది. దీంతో రోజూ వండలేక పాచిన ఆహారాన్నే వడ్డిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

ఇవిగో ఆధారాలు



పూతలపట్టు వసతి గృహం ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

- తిరుపతి జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో 398 మందికి 110, చిత్తూరు జిల్లాలో 238 మందికి 98 మంది మాత్రమే భోజనం తింటున్నారు. మిగిలిన వారు వివిధ రోగాలతో ఇంటి వద్దే ఉంటున్నారు.
- చిత్తూరు జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 3,116 మందికిగాను 1,200 మంది అనారోగ్యాలతో వసతి గృహాలకు రావడంలేదు. అలాగే తిరుపతి జిల్లాలో 4,991 మందికిగాను 2,300 మంది పలు సమస్యలతో ఇంటిబాట పట్టారు.
- చిత్తూరు జిల్లాలోని బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 2,231 మందికి గాను 1,045, తిరుపతి జిల్లాలోని వసతి గృహాల్లో 5,384 మందికి 2,456 మంది మాత్రం హాజరవుతున్నారు.

ఫినాయిల్‌కు సొమ్ము లేదంట

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ఫినాయిల్‌కు కూడా నిధులు లేవని పలువురు వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. బడ్జెట్ ఇవ్వకపోవడంతో లైట్లు పనిచేయకపోయినా, చీపుర్లు, చిన్న చిన్న స్విచ్‌లు లాంటివి రిపేరు కొచ్చినా అలాగే వదిలేయాల్సి వస్తోందని వాపోతున్నారు. శ్రీకాళహస్తి, కుప్పం, చిత్తూరు, తిరుపతి, పుత్తూరు, గూడూరులోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో దాదాపు 35 మంది ఒప్పంద ప్రాతిపదికలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను తొలగించినట్లు తెలిసింది. దీంతో అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా మారుతోంది.



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఇదీ పరిస్థితి



రేణిగుంట బీసీ బాలుర వసతి గృహంలో అపరిశుభ్రంగా వంటగది

తెరుచుకోని వరదయ్యపాళెం బీసీ హాస్టల్



వరదయ్యపాళెం: ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు పూర్తికావస్తున్నా నేటికీ వరదయ్యపాళెంలోని బీసీ హాస్టల్ తెరుచుకోలేదు. ఇక్కడ పాత విద్యార్థులు 17 మంది ఉండగా మరో 22 మంది నూతనంగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ హాస్టల్ వార్డెన్ రామయ్యను వివరణ కోరగా మరో వార్డెన్‌కు హాస్టల్ బాధ్యతలను అప్పజెప్పేందుకు ప్రభుత్వం వద్ద ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

పిల్లలను పంపాలంటే భయంగా ఉంది



“పిల్లలను గురుకుల పాఠశాలకు పంపాలంటే భయంగా ఉంది. నాయుడుపేట గురుకుల పాఠశాలలో ఘటన చూసి భయపడిపోయాను. పేదరికంలో ఉండే నాలాంటి ఎంతో మంది గురుకుల పాఠశాలలపై నమ్మకంతో పిల్లలను చదివించుకుంటున్నాం. మాకు దూరంగా ఉండే పిల్లలకు నిన్నటి అన్నం పెట్టడం చాలా అన్యాయం. మరుగుదొడ్లను సరిగ్గా శుభ్రపరచడం లేదు. ఏమైనా ఫిర్యాదులు చేస్తే పిల్లలను ఇబ్బందులు పెడతారని చెబుతున్నారు.

– గురునాథం, శ్రీకాళహస్తి, విద్యార్థి తండ్రి, తిరుపతి జిల్లా

ఉన్నతాధికారులు పట్టించుకోవాలి



ఉన్నతాధికారులు పట్టించుకుని తనిఖీలు చేయాలి. నా మనవడుని పూతలపట్టు గురుకుల పాఠశాలలో చదివించుకుంటున్నాను. నేనొచ్చినప్పుడల్లా ఏదో ఒక సమస్య చెబుతూనే ఉంటాడు. నాకు చెబితే నేనేమి చెయ్యాలి. ఉన్నతాధికారులు పాఠశాలను పరిశీలన చేస్తే పిల్లలు వారి సమస్యలను చెప్పుకుంటారు. అలా చేయకపోవడం వల్ల సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలొస్తే చూసేవారే కరువయ్యారు.

– జమున, విద్యార్థి అవ్వ, గంగాధరనెల్లూరు మండలం, చిత్తూరు జిల్లా

ప్రభుత్వ కార్యాలయాలను విడదీయడమెందుకో?

- ఒకే ప్రాంగణంలో ప్రహరీ గోడలెందుకు?
- తహసీల్దార్ తీరుపై మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఫైర్

సూళ్లూరుపేట: 'ఎప్పుడో బ్రిటీషర్ల కాలం నుంచి సూళ్లూరుపేట తాలూకా కార్యాలయానికి సంబంధించి అన్ని కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో నిర్మించారు. తాలూకాల తరువాత మండల కేంద్రాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత ఎంతో మంది తహసీల్దార్లు పనిచేసి వెళ్లారు. ఏ తహసీల్దార్ కూడా ప్రభుత్వ కార్యాలయాలను వేరుచేస్తూ ప్రహరీ గోడలు నిర్మించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్ ఆ కార్యాలయాలను వేరు చేస్తూ ప్రహరీగోడలు నిర్మించే అవసరం ఎందుకొచ్చింది' అంటూ సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తహసీల్దార్‌ను నిలదీశారు. మంగళవారం ఆయన తహసీల్దార్‌తో మాట్లాడేందుకు కార్యాలయానికి విచ్చేయగా.. ఆయన లేకపోవడంతో మరోమారు వస్తామని చెప్పారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ అధికార పార్టీ నేతల ప్రాపకం కోసం వారికి అనుగుణంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడే పాతుకుపోయేందుకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒకే ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఈయన వచ్చిన తరువాత ఇటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి, ఇటు మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి దారి లేకుండా అడ్డంగా ప్రహరీగోడ నిర్మించారని చెప్పారు. కార్యాలయాల మధ్య ఎందుకు దూరం పెంచుతున్నారో అర్థం కావడం లేదన్నారు. అదేవిధంగా ఇటీవల బియ్యం అక్రమ రవాణా విషయంలో ఒక లారీని సదరు తహసీల్దార్ ఒక్కరే వెంబడించి ఎందుకు పట్టుకోవాల్సి వచ్చిందో? అంతుపట్టడం లేదన్నారు. పోలీసుల సహాయం తీసుకోకుండా ఒక్కరే ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు ఇలా అధికారపార్టీ నాయకులకు తొత్తుల్లా మారడం హాస్యాస్పదమన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

విద్యార్థులకు పరామర్శ

నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మాజీ ఎమ్మెల్యే కిలివేటి పరామర్శించారు. సుమారు 20 మంది దాకా ఇక్కడ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై వాకబు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని, అలాగే పిల్లలకు పెట్టే భోజనం నాణ్యంగా ఉండాలని చెప్పారు. తాజా కూరగాయలు, మాంసం వినియోగించాలన్నారు. ఆయన తో పాటు ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణ, బందిల మహేష్, వాకాటి బాబురెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక పాయింట్‌లో అనధికార వసూళ్లు


నిర్వాహకులతో గ్రామస్తుల వాగ్వాదం

నాగలాపురం: సుబ్బానాయుడుకండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్‌లో అనధికారికంగా బలవంతపు వసూళ్లకు తెరలేపారు. మంగళవారం సుబ్బానాయుడుకండ్రిగ రీచ్‌లో ఒక్కొక్క టిప్పరు, లారీకి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్, ట్రాక్టర్ యజమానుల మధ్య వివాదం తలెత్తింది. తెలుగుదేశం నాయకులు రూ.2 వేలు ఇచ్చిన టిప్పర్లకే మొదటి ప్రాధాన్యమిస్తున్నారని స్టాక్ పాయింట్లలో గందరగోళం మొదలైంది. స్థానికులు ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేయడానికి ఏ మాత్రం అనుమతించడంలేదు. రెండు రోజుల క్రితం తిరుపతి జేసీ ధ్యాన్‌చంద్ ఇసుక స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. చుట్టు పక్కల గ్రామాలైన స్థానికులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసినా పట్టించుకోలేదు. రెవెన్యూ సిబ్బందికి తెలియకుండానే వసూళ్లు మొదలు పెట్టారని ట్రాక్టర్ల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ట్రాక్టర్ల యజమానులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన


ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న బిడ్జ్ సంస్థ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ, ఎంప్లాయ్ బిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్తంగా శ్రీసిటీలో మంగళవారం నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. 2022, 2023, 2024 సంవత్సరాలలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ విభాగాల్లో ఉత్తీర్ణత సాధించిన 400 మంది ఈ మేళాలో పాల్గొన్నారు. శ్రీసిటీలోని పది ప్రముఖ పరిశ్రమలు మేళాలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించాయి. 363 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయగా 150 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. తరచూ మెగా ఉద్యోగ మేళాలను నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.

ఇంకా ఆస్పత్రిలోనే 71 మంది విద్యార్థులు

- 78 మంది డిశ్చార్జ్
- మరో 10 మందికి డయేరియా
- నాయుడుపేట గురుకులంలో జోరుగా పారిశుద్ధ్య పనులు
- కొనసాగుతున్న జిల్లా అధికారుల పరామర్శలు


నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్న గురుకుల విద్యార్థులు


విద్యార్థులను తీసుకుని ఇంటికి వెళుతున్న కుటుంబ సభ్యులు

నాయుడుపేట టౌన్: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 139 మంది విద్యార్థుల్లో ఇంకా 71 మంది విద్యార్థులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ బాలుర గురుకులంలో కలుషిత ఆహారం కారణంగా 139 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెల్సిందే. మంగళవారం నాటికి 78 మంది విద్యార్థులు డిశ్చార్జ్ కాగా.. మిగిలిన వారిలో 61 మంది నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. అలాగే నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో 14 మందికి చికిత్స అందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆందోళకరంగా ఉన్న వారి పరిస్థితి కొంత మేరుగు పడిందని స్థానిక ప్రభుత్వ వైద్యురాలు రూప తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వీఆర్వోలు సమాచారం అందిస్తున్నట్లు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని చెప్పారు. ఇదిలావుండగా గురుకులంలో మరో 10 మంది విద్యార్థులకు మళ్లీ వాంతులు, విరోచాలు కావడంతో వారిలో కొంతమందిని నెల్లూరుకు తరలించారు. మిగిలిన వారికి స్థానికంగానే చికిత్స అందిస్తున్నారు.

గురుకులానికి మూడు రోజుల పాటు సెలవు

నాయుడుపేట బాలుర గురుకులానికి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. గురుకులంలో దుర్భర పరిస్థితులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరంజనేయ స్వామితో పాటు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌లు, కోఆర్డినేటర్ పద్మజ తదితరులు పరిశీలించారు. పారిశుద్ధ్యం, ఇతర పనులు చేయడానికి వీలుగా గురుకులానికి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్లిపోయారు.

మొదలైన పారిశుద్ధ్య పనులు

గురుకులంలో పారిశుద్ధ్య పనులు ప్రారంభమయ్యాయి. డార్మెంటరీ, తరగతి గదులు తదితర చోట్ల మున్సిపల్ సిబ్బందితోపాటు ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. మరుగుదోడ్లతో పాటు నిరుపయోగంగా ఉన్న గురుకుల భవనం, బహిరంగ మలమూత్ర విసర్జనలు చేసి దుర్వాసనలు వస్తుండడంతో స్థానిక పారిశుద్ధ్య కార్మికులు వాటిని శుభ్రం చేస్తున్నారు.

ఫుడ్ అండ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

గురుకులంలో జిల్లా ఫుడ్ అండ్ కంట్రోల్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. వంట గదితో పాటు, విద్యార్థులు భోజనం చేసే గదులు అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించారు. అంతేకాకుండా వంట గదిలో రెండు డీప్ ఫ్రీజ్‌లు ఉండడం .. వాటిల్లో చికెన్‌తో పాటు మిగిలిన కూరలు తదితర వాటిని నిల్వ చేసేందుకు ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని ఉపయోగించరాదని గురుకుల వార్డెన్‌ను ఆదేశించారు.

నిలకడగా గురుకుల విద్యార్థుల ఆరోగ్యం


గూడూరు ఆస్పత్రిలో కోలుకుంటున్న విద్యార్థులు

చిల్లకూరు: నాయుడుపేట గురుకులంలో అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 41 మందికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మంగళవారం నెల్లూరుకు తరలించారు. అలాగే మరో విద్యార్థిని తల్లిదండ్రులు గూడూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా పర్యవేక్షణలో వైద్యసేవలందిస్తున్నారు. ఇదిలావుండగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మజ్జిగ, ఓఆర్ఎస్ అందించే ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు చికిత్స అందించనున్నట్టు వెల్లడించారు. తల్లిదండ్రులకు కూడా అవసరమైన ఆహారం అందిస్తామన్నారు. ఆయన వెంట గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.


ఆస్పత్రిలో విద్యార్థులతో మాట్లాడుతున్న గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్

మార్కెట్లు, పార్కింగ్ స్థలాలకు
రేపు బహిరంగ వేలం

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్లు, పార్కింగ్ స్థలాలకు 18వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని, సీల్డ్ టెండర్ల ద్వారా పాల్గొనని వారు కూడా నేరుగా బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. అధికారులతో మంగళవారం మార్కెట్ వేలంపై చర్చించారు. బహిరంగ వేలంలో డిపాజిట్ చెల్లించి నిబంధనల మేరకు అర్హులైన అందరూ పాల్గొనవచ్చన్నారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రామచంద్ర గుంటకట్ట కూరగాయల మార్కెట్, జంతు వధశాల, పార్కింగ్ స్థలాలకు బహిరంగ, సీల్డ్ కవర్ వేలానికి టెండర్లు ఆహ్వానించినట్లు చెప్పారు. సీల్డ్ కవర్ టెండర్ కు గడువు ముగిసిందని, అయితే ఈనెల 18వ తేదీన నిర్వహించే బహిరంగ వేలంలో నిబంధనలను అనుకరించి పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముందుగా బహిరంగ వేలం, ఆ తర్వాత సీల్డ్ కవర్ టెండర్ల ఓపెన్ చేస్తారని చెప్పారు. వేలం దక్కించుకున్న వారు 2025 మార్చి 31వ తేదీ వరకు రుసుము వసూలు చేసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. కూరగాయల మార్కెట్‌కు – 7 పార్కింగ్ స్థలాలకు– 4 సీల్డ్ కవర్ టెండర్లు వచ్చినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు నగరపాలక సంస్థ ఉప కమిషనర్‌ని సంప్రదించాలని, నిబంధనల ప్రకారం నిర్వహించే బహిరంగ వేలానికి గురువారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని వారు పేర్కొన్నారు.


మార్కెట్ వేలంపై సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్

భూ ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

కోట: మండలంలోని కేసవరంలో గిరిజనులు నివాసముంటున్న కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం రాఘవాపురానికి చెందిన అధికార పార్టీ నేతలు కొందరు గిరిజన కాలనీ వద్దకు చేరుకుని అక్కడ ఖాళీ స్థలంలో కొలతలు వేస్తుండగా స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్ఓ మోసిన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గిరిజనులు సామాజిక భవనాన్ని నిర్మించుకునేందుకు ఇక్కడ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఎటువంటి అక్రమ కట్టడాలు చేపట్టరాదని హెచ్చరించారు. దీంతో వారు వెనుదిరిగారు.

పాత నేరస్తుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్ : ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బంగారు నగలను అపహరించుకెళ్లిన కేసులో పాత నేరస్తుడు తిరుపతి, రాజీవ్‌నగర్, ఎస్ఎల్‌వీ నగరకు చెందిన ఈశ్వరదాము అలియాస్ ఏటీఎం దాముకు ఏడాది జైలు శిక్ష, పది వేల రూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వై.సరిత మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. గతేడాది నవంబర్ 29వ తేదీ తిరుపతిలోని మంగళం పరిధిలో ఉన్న శేషాచల నగర్‌కు చెందిన ఆర్.చిత్ర ఇంట్లోకి నిందితుడు ఈశ్వర దాము మరో ఇద్దరు కలిసి అక్రమంగా ప్రవేశించి 116 గ్రాముల బంగారు నగలను అపహరించుకెళ్లారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

చోరీ కేసులో..

తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురంలో గత ఏడాది నవంబర్ 24వ తేదీన బైక్ అపహరించిన కేసులో తిరుపతి, రాజీవ్‌నగర్, ఎస్ఎల్‌వీ నగర్‌కు చెందిన ఈశ్వరదాము అలియాస్ ఏటీఎం దాముకు 9 నెలలు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సరిత తీర్పు చెప్పారు. కలికిరి మండలం, సన్యాసివారిపల్లికి చెందిన పసుపులేటి ద్వారక ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు నిందితుడు దాముపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

లైంగికదాడి యత్నం కేసులో జైలు


నిందితుడు శ్రీరాములు

చిత్తూరు అర్బన్/పుత్తూరు: బాలికపై లైంగిక దాడికి యత్నం కేసులో గంజి శ్రీరాములు (71) అనే నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం మేరకు.. పుత్తూరు మండలం, గొల్లపల్లెకు చెందిన శ్రీరాములు 2020 ఏప్రిల్ 20న తన ఇంటి వద్ద ఆడుకుంటున్న ఓ ఎనిమిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. బాలిపై లైంగికదాడికి ప్రయత్నించగా, ఆమె అరుస్తూ అతడి బారి నుంచి తప్పించుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై అప్పట్లో సీఐ ఎం.వెంకట్రామిరెడ్డి పోక్సో (పిల్లలపై లైంగిక దాడుల నివారణ చట్టం) కింద కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కేసు తుది విచారణకు రాగా నేరం రుజువైంది. దీంతో శ్రీరాములుకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బాలిక కుటుంబానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- మృతుని కుటుంబాన్ని ఓదార్చిన మోహిత్‌రెడ్డి
- అర్ధరాత్రిలో మేదరమిట్టలో విషాదం


మహేష్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి ఎర్రావారిపాళెం మండలం, బోడేవాండ్లపల్లె పంచాయతీ, మేదరమిట్టలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహేష్ (28) ఇంటి వద్ద విద్యుత్ మీటరుకు అమర్చిన ఓ వైరు మెయిన్ లైన్‌లో నుంచి తెగి ఇంటి గేటుపై పడింది. దీన్ని గమనించకుండా ఇనుపగేటును మహేష్ తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మధుసూదనరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

చిల్లకూరులో మరొకరు మృతి

చిల్లకూరు: కూలి పనులకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న సమయంలో వీధి లైట్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగలడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బల్లవోలు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తీర ప్రాంతం బల్లవోలు గ్రామానికి చెందిన కొట్టు పెంచలయ్య (54).. అదే గ్రామంలోని ఓ ఇంట్లో కూలి పనులకు వెళ్లాడు. ఆ ఇంటి ఆవరణలో ఉన్న వేప చెట్టు దగ్గర పనిచేస్తున్న సమయంలో దానిపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు అతనికి తగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పెంచలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

23.4 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: చెన్నైకి చెందిన నలుగురు యువకులు 23.4 కిలోల గంజాయిని చెన్నైకి తరలిస్తుండగా గూడూరు రైల్వే పార్శిల్ విభాగం వద్ద మంగళవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. దీని విలువ రూ.1,17,000 ఉంటుందన్నారు. ఈ మేరకు తన కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ చెన్నైకి చెందిన సెల్వం గోకుల్(23), శరవన్ అభిషేక్(22), రాజ్ తమిళ్‌సెల్వం(23) తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. శివ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్టు వెల్లడించారు. డీజీపీ ఆదేశాల మేరకు ప్రధానంగా మద్యం, గుట్కా, గంజాయి తదితర అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వాటికి బానిసలు కాకుండా యువత దూరంగా ఉండాలని సూచించారు. ఈ కేసులో పట్టుబడితే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమాలపై పోలీసులకు సమాచారం అందిచాల్సిన వారు 8099999977 నంబర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు. గంజాయి నేరస్తులును పట్టుకోవడంతో సహకరించిన డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరిబాబుతోపాటు సిబ్బందిని అభినందించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ విజిలెన్స్‌తో సమన్వయం చేసుకోండి

టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారులతో పోలీసులు సమన్వయం చేసుకుని పనిచేయాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి తిరుమల సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. తిరుమలలో పిట్‌పాకెట్ నేరగాళ్లు, సెల్‌ఫోన్ దొంగలు, కిడ్నాపర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. శ్రీవారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయాలని ఆదేశించారు. పోలీసులు భక్తులతో గౌరవంగా మాట్లాడి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని చెప్పారు. ఆయన వెంట ఏఎస్పీ విమలకుమారి, డీఎస్పీ శ్రీనివాసాచారి, సీఐలు ఉన్నారు.

ఇనుప రాడ్డుతో వ్యక్తిపై దాడి

- ప్రాణాపాయ స్థితిలో చెన్నైలో చికిత్స పొందుతున్న బాధితుడు
- అక్రమ సంబంధమే కారణమా?

తడ: తడలోని ఓబాలమ్మ గుడి సమీపంలో శ్రీసిటీలో పనిచేస్తున్న తునికి చెందిన సతీష్ కుమార్‌పై గుర్తుతెలియని దుండగుడు మంగళవారం ఇనుపరాడ్‌తో దాడికి తెగబడ్డారు. సతీష్ డ్యూటీకి వెళ్లే సమయాన్ని గమనించిన దుండగుడు కాపు కాచి ఇనుప రాడ్డుతో వెనుక నుంచి దాడికి పాల్పడ్డాడు. స్థానికులు కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నరశింహారావు గాయపడ్డ సతీష్‌ని శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తమిళనాడుకు తరలించారు. దాడికి పాల్పడ్డ నిందితుడి ఆచూకీ కోసం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు, తడ, సూళ్లూరుపేట, నాయడుపేటల్లో గాలింపు చేపట్టారు.

అక్రమ సంబంధమే కారణమా?

గాయపడ్డ సతీష్ తునిలోని ఓ ప్రైవేటులో పరిశ్రమలో పనిచేసే సమయంలో అదే పరిశ్రమలో హౌస్ కీపింగ్ చేసే కాకినాడకు చెందిన మౌనికతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారి అక్రమసంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో సతీష్‌కి శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం రావడంతో అతను అక్కడి నుంచి తడకు వచ్చేశాడు. నెలన్నర క్రితం మౌనిక కూడా తన భర్త, ఇద్దరు పిల్లలను వదిలి తడలోని సతీష్ వద్దకు వచ్చి సహజీవనం చేస్తోంది. తాజాగా వీరిద్దరూ విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆమె భర్త రవీంద్రబాబు తడకు చేరుకుని వీరు ఉంటున్న ప్రదేశాన్ని గుర్తించాడు. ఆపై కాపుకాచి సతీష్‌పై దాడి చేసినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో తెలుసుకున్నారు. ఆ మేరకు మౌనిక తన భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ తడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.


దాడిలో గాయపడ్డ సతీష్

మనవత్వం చాటుకున్న ఏఎస్ఐ

తడ ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. దాడిలో గాయపడ్డ సతీష్‌కుమార్‌ని శ్రీసిటీ అంబులెన్స్‌లో రెడ్‌హిల్స్‌లోని రేలా ఆస్పత్రికి తరలించగా అక్కడ అతనికి (బీ పాజిటీవ్) రక్తం అవసరమని వైద్యులు చెప్పారు. తనది కూడా అదే గ్రూపు రక్తమని చెప్పిన శ్రీకుమార్‌రెడ్డి చెన్నై సిటీలోని అన్నానగర్ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి తన బ్లడ్ డొనేట్ చేసి బాధితునికి అందించాడు. దీనిపై తడ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది శ్రీకుమార్‌రెడ్డిని అభినందించారు.


ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

– రెండు హోటళ్లు సీజ్


నాయుడుపేటలో హోటళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

నాయుడుపేటటౌన్: పట్టణంలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా హోటళ్లు, దాబాలను తనిఖీ చేశారు. ఉమ్మడి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధికారి జీ.వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి నర్మద స్థానిక మున్సిపల్ కమిషనర్ జనార్ధర్‌రెడ్డితో కలిసి పట్టణంలోని పలు హోటళ్లు, దాబాలను తనిఖీ చేశారు. బస్టాండు సమీపంలో ఉన్న అమరావతి, తిరుమల హోటళ్ల వద్ద వంట చేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడం, కుళ్లిన ఆహార పదార్థాలు ఉండడంతో అక్కడి నిర్వాహకులకు నోటీసులు అందించారు. ఆ తర్వాత ఆ రెండు హోటళ్లను ఎస్ఐ గోపి సమక్షంలో అధికారులు సీజ్ చేశారు. పట్టణంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు తెలుసుకున్న అనేక హోటళ్లు, దాబాల నిర్వాహకులు తాళాలు వేసుకుని వేళ్లిపోయారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలకు చెందిన అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధికారి జీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హోటళ్లు, దాబాల నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పెద్ద హోటళ్లకు లైసెన్స్‌లు, చిన్న వాటికి రిజిస్ట్రేషన్‌లు తప్పక చేపుకోవాలని చెప్పారు. లేని వాటిని సీజ్ చేయడమే కాకుండా సుమారు రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తామని చెప్పారు. రోజులు తరబడి ఫ్రీజ్‌లలో నిల్వ చేసిన మాంసం, ఇతర వాటిని వినియోగించరాదన్నారు.

వేడుకగా గోవిందుడి జ్యేష్టాభిషేకం


ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, జ్యేష్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో మంగళవారం జ్యేష్టాభిషేకం వేడుకగా ప్రారంభమైంది. స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు ఈ మహోత్సవం జరుగనుంది. ప్రతి ఆషాఢ మాసంలో శ్రీగోవిందరాజస్వామి వారికి జ్యేష్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి కైంకర్యాలు నిర్వహించారు. శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కవచాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయులు పాల్గొన్నారు.